# రక్షకుని వెదకుట

## మత్తయి 2:1-13, పరిశీలన

జీవింతంలో జనులు అనేకమైన వాటిని కావాలనుకుంటారు. గొప్ప పేరు, భాగ్యము, సంతోషము అనేవి వాటిలో ఉంటాయి. ప్రభువు మాటల్లో చెప్పాలంటే "అవసరమైనది ఒక్కటే" (లూకా 10:42ఎ): ప్రభువును వెదకు. "వారు ఒకవేళ దేవుని తడవులాడి (వెదకి) కనుగొందురోమోయని ... ఆయన అందరికిని జీవమును ఊపిరిని సమస్తమును దయచేయువాడు" (అపొ. 17:25–27). "దేవా, నా దేవుడవు నీవే, వేకువనే నిన్ను వెదకుదును" అని దావీదు అన్నాడు (కీర్తన. 63:1). మీ "దేవుడైన యెహోవాను మీరు వెదకిన యెడల" మీరు ఆయనను కనుగొందురని మోషే ఇశ్రాయేలీయులను ప్రోత్సహించాడు (ద్వితీయో. 4:29).[1]

"పూర్ణహృదయముతోను పూర్ణాత్మతోను తమ పితరుల దేవుడైన యెహోవా యొద్ద" విచారణ చేసిన కొందరిని మనం యిందులో ఎదుర్కొనబోతున్నాం. (2 దినవృ. 15:12). "దేవుని వెదకిన ముగ్గురు మనుష్యులను" గూర్చి చెప్పాను – ఎందుకంటే "మూడు" అనే అంకెను ప్రస్తావించినప్పుడు, ఆ ముగ్గురు తప్పని సరిగా కన్పిస్తారు. బేత్లెహేములో యేసును పూజింపవచ్చిన ఆ జ్ఞానులను గూర్చి నేను సూచిస్తున్నట్టు నీవు ఊహించవచ్చు.

ఈ ప్రసంగం సాధారణమయింది: ఈ జ్ఞానులు యేసును వెదకుతూ వచ్చినట్టును, వారు యేసును కనుగొనినట్టును, తత్ఫలితంగా వారి జీవితాలు ధన్యములైనట్టును (దీవించబడినట్టును) నేను నొక్కి చెప్పగోరుతున్నాను.[2] నీవు, నేను కూడా వారి మాదిరిని అనుసరించాలని నేను చెప్పగోరుతున్నాను. ఇది బాగుగా ఎరిగిన కథ గనుక, ఎరుకైన వివరాలలో నేను ఎక్కువ కాలం గడపదలచుకోలేదు[3] – అయితే నేను ఈ ప్రశ్న అడుగ దలచాను: "వారివలెనే మనమును జ్ఞానంగలవారమా?"[4]

### వారు యేసును వెదకిరి (1-9, 11, 13 వచనాలు)

**జ్ఞానులు**

> రాజైన హేరోదు దినములయందు యూదయ దేశపు బేత్లెహేములో యేసు పుట్టిన పిమ్మట ఇదిగో తూర్పు దేశపు జ్ఞానులు యెరూషలేమునకు వచ్చి యూదుల రాజుగా పుట్టినవాడెక్కడ నున్నాడు? తూర్పుదిక్కున మేము ఆయన నక్షత్రము చూచి, ఆయనను పూజింపవచ్చితిమని చెప్పిరి (1, 2 వచనాలు).

యేసును వెదకిన వారిని గూర్చి చర్చించడానికి కొన్ని నిమిషాలను మనం తీసికోవాలి. అనేకమైన సంప్రదాయాలు కలిగాయి; దానితో మత్తయి 2లోని అసలైన సందర్శకులు మరుగున పడిపోయారు.[5]

ఈ మనుష్యులు "జ్ఞానులు"[6] అనబడ్డారు. "Magi" అనే పదంనుండి "magic" మరియు "magician" అనే పదాలు వచ్చాయి. ఆ దినాల్లో ఈ "Magi" (జ్ఞానులు) అనే వారు తమ తెలివికిని, గ్రహింప శక్తికిని గుర్తింపు పొందినవారు. అందువలన తరచుగా వారిని మనం జ్ఞానులు అని అంటాం. ఈనాటి ప్రమాణాల ప్రకారం వారి తెలివి లోపభూయిష్టమైనది – విజ్ఞాన శాస్త్రము, మూఢ నమ్మకాలు అనే వాటితో అది పెనవేయబడింది. అయినప్పటికిని, జ్ఞానులనే పేరు వారికి ఉండేది మరియు తరచుగా వారు రాజులకు సలహాదారులుగా ఉండేవారు.

వారు ముగ్గురు జ్ఞానులని జనులు అభిప్రాయపడ్డారు – తరువాత వారు సమర్పించిన మూడు కానుకలను బట్టి ఈ అభిప్రాయానికి జనులు వచ్చి ఉండవచ్చు (11 వ.) – అయితే మూడు బహుమానాలు కొద్ది మందివలనగాని ఎక్కువమంది వలనగాని యివ్వబడవచ్చు. జ్ఞానులు (Magi) అనేది బహువచనం గనుక కనీసం యిద్దరైనా అయ్యుండాలి కాని పన్నిద్దరుగాని అంతకంటే ఎక్కువ మందిగాని అయుండవచ్చు కూడా.[7]

తూర్పు దేశపు "జ్ఞానులు" అనడంలో, వారు నిజంగా ఏ దేశపువారనేది నిశ్చయంగా తెలియదు. వారు తెచ్చిన కానుకలను బట్టి వారు అరేబియా దేశానికి చెందినవారై యుండవచ్చునని కొందరు అభిప్రాయపడ్డారు. పారసీక దేశము మంచి ఊహయై యుండవచ్చు – ఎందుకంటే జ్ఞానులు అక్కడ వికసించారు. యథార్థంగా వారు ఏ దేశమునుండి ప్రయాణమయ్యారో మనకు తెలియదు, పాలస్తీనాకు తూర్పుదిశగా – అరేబియా, పర్షియా, బబులోను, మెసపటోమియా ప్రాంతమంతా, ఇండియా, యింకా యితర దేశాలున్నాయి.

జ్ఞానులను గూర్చిన ఒక విషయం మాత్రం విదితమైయుంది. ఏమంటే – వారు యూదేతరులు. "మన రాజు" అని వారు అనలేదు, "యూదుల రాజు" అని వారు పలికారు. బాలుడైన యేసు దేవాలయానికి కొనిపోబడినప్పుడు, వృద్ధుడైన సుమెయోను యిలా అన్నాడు: "అన్యజనులకు నిన్ను బయలుపరచుకొనుటకు వెలుగుగాను ..." అని అన్నాడు (లూకా 2:32).[8] జ్ఞానులు దర్శించిన కథనం, యేసు జన్మ సార్వత్రిక వర్తింపును నొక్కి చెప్తుతుంది. యేసు కేవలం ఇశ్రాయేలు రక్షకుడు మాత్రమే కాదు; ఆయన "లోకరక్షకుడు" (యోహాను 4:42).

ఈ మనుష్యులను గూర్చి మనకు తెలియనిది చాలా ఉంది, కాని వారి అత్యంత ముఖ్యమైన గుణలక్షణమేమో మనకు తెలుసు. "యూదుల రాజును" వెదకడంలో వారు కృతనిశ్చయం కలవారు. వారి నిజమైన జ్ఞానం దశాబ్దాల తరబడి వారు చేసిన పరిశోధనల్లో గాని, ప్రకృతి సిద్ధమైన లోకాన్ని తెలుసుకోడంలో కాని కాక, నిజంగా ముఖ్యమైనదేదో దాన్ని గ్రహించడంలోనే ఉంది. నీవు బహు తెలివైన వాడవో కాదో, లేక బాగుగా చదువుకున్నవాడవో కాదో, కాని నీవు "రాజులకు రాజును, 'ప్రభువులకు' ప్రభువునైన" వానిని వెదకుటలో శ్రద్ధగలవాడవైతే (ప్రకటన 19:16), నీవు జ్ఞానివి!

## పని

ఆ జ్ఞానులు పాలస్తీనాకు అంత దీర్ఘమైన కఠినమైన ప్రయాణం ఎందుకు చేశారు? తమ సామాగ్రిని తరలించుకుని వారు వర్తకులుగా వచ్చారా? లేదు మధ్యధరా సముద్రంలో ఈతగొట్టడానికిగాని, మృత సముద్రంలో తేలాడడానికిగాని, యాత్రికులుగా వారు వచ్చారా? లేదు. రాజైన హేరోదుతో సత్ సంబంధాలు నెలకొల్పుకొనడానికిగాని రాయబారులుగా వచ్చారా? లేదు. వారు యెరూషలేమునకు వచ్చి, "యూదుల రాజుగా పుట్టిన వాడెక్కడనున్నాడు?" అని అడిగారు. (మత్తయి 2:2ఎ). వారు పాలస్తీనాకు ఒకే ఉద్దేశంతో వచ్చారు? మెస్సీయాను కనుగొనడానికి!

వారెందుకు సరిగా ఆయనను కనుగొనకోరారు? "మేము ... ఆయనను పూజింపవచ్చితిమనిరి." (2బి వ.) ఆయన కేవలం "యూదుల రాజు" మాత్రమే కాదు; ఆయన వారికి కూడా రాజే. ఆయన ముందర సాగిలపడడానికి వారు వందలు లేక వెయ్యి మైళ్లు పయనించారు.

మనం కూడా వారివంటి జ్ఞానం గలవారమైయుంటిమా, యేసును వెదకడంలో అవసరమయ్యే ఏ త్యాగమైనా అంత గొప్పది కాదని మనం నేర్చుకోవాలి. ఇప్పుడైతే దేవుడు, "క్రీస్తునందు పరలోక విషయములో ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మనకు అనుగ్రహించెను." (ఎఫెసీ. 1:3). ప్రభువును వెదకడం తమ జీవితాన్ని నడిపించే శక్తిగా ఉండగోరే యథార్థ హృదయాల కొరకు దేవుడు యింకను చూస్తూనే ఉన్నాడు "తన్ను వెదకువారికి" ఫలము దయచేయువాడై యున్నాడు (హెబ్రీ. 11:6).

## విధానం

జ్ఞానులు, వారి పని అనే దాన్నిగూర్చి మనం కొంత గ్రహించినప్పుడు, వారు తమ పనిని నెరవేర్చుకొనడానికి ఎలా వీలుకలిగిందని మనం తలంచవచ్చు. వారు అన్యజనులు లేక యూదేతరులు. వారు యింతకు యూదుల రాజును గూర్చి ఎలా నేర్చుకోగలిగారు? ఆయనను గూర్చి వారు నేర్చుకున్నారే అనుకో, ఆయనను కనుగొనడం ఎలాగో వారికి ఎలా తెలుసు?

యూదులైన తమ పొరుగువారి వద్దనుండి వారు ఆ సంగతి నేర్చుకున్నట్టు కొందరు ఊహించారు. ఇది సాధ్యమే. ఆ కాలానికి యూదులు లోకమందంతట చెదరియున్నారు.[9] ఇతర దేశాలలో వారు తమ వృత్తులను వినియోగించుకొనడం మాత్రమేగాక, వారు విశ్వాసాన్ని సయితం పంచుకొంటూ వచ్చారు.[10]

యేసును కనుగొనడం ఎలాగో జ్ఞానులు తెలిసికొనడానికి సంబంధించి,"తూర్పు దిక్కున మేము ఆయన నక్షత్రము చూచి" అని వారన్న మాటలలో మనకు సమస్యను విడదీసే చిట్కా లభిస్తుంది. నక్షత్రమనేది ప్రకృతిలో గోచరమయ్యే వస్తువు అని కొందరు నమ్ముతారు. తప్పుడు శాస్త్రాలలో జ్ఞానులు ఉపయోగించే ఒకటి జ్యోతిష్యము. పాత నిబంధన జ్యోతిష్యాన్ని అపహాస్యం చేస్తుంది (యెషయా 47:13-15; దానియేలు 1:20; 2:27; 4:7; 5:7, 8); దేవుని ప్రజలు దానిలో చొరబడకూడదని నిషేధం విధిస్తుంది (యిర్మీయా 10:1, 2). అయినప్పటికి, జ్యోతిష్యంలో ఆ జ్ఞానులకున్న శ్రద్ధయే వారిని

పాలస్తీనాకు నడిపించి ఉంటుందని అనేకులు నమ్ముతారు. పరలోకసంబంధమైన ఆకారము లేక పోలికయే పశ్చిమదిశగా జ్ఞానులు పయనించునట్టు ప్రేరేపించిందనే ఊహలతో పేజీలు నిండాయి.[11]

మెస్సీయాను గూర్చి ఆ జ్ఞానులు ఎలా నేర్చుకున్నారు అనే ఊహలను దాటుకొంటూ, వారు ఫలాని నక్షత్రాన్ని వెంబడింప ఎలా తీర్మానించుకున్నారో అనే దాన్నికూడా దాటుకొని ముందుకు వస్తే, J. W. మెగార్వే వచ్చిన తీర్మానానికే నేను వచ్చాను. జ్ఞానులపైబడడానికి వీలైయ్యే అవకాశాలన్నిటిని మెగార్వే పేర్కొన్న తరువాత, అతడు యిలా ముగించాడు: "ఇదంతా కలిసికూడా జ్ఞానుల దర్శనము చేయవచ్చుటను వివరించలేవు. వారు నేరుగా దేవునిచే నడిపింపబడ్డారు. మరియికను ఏదియు వారిని ప్రభావితం చేసి ఉండదు."[12]

పాత నిబంధన యూదులతో దేవుని వైఖరిని చూపడానికి కేంద్రీకరించింది. దేవుడు యూదేతర లోకాన్ని సంపూర్ణంగా అలక్ష్యం చేయలేదు. యూదేతరులతో దేవుడు ఎలా పని చేశాడన్న సంగతిని గూర్చి మనకు అంతగా తెలియదు. ఎందుకంటె ఒక జనాంగాన్ని దేవుడు ఎలా సిద్ధపరచాడు అనే విషయాన్ని తెలియజేయడం పాతనిబంధన ఉద్దేశమై యుంది. – వారి ద్వారా దేవుడు తన కుమారుని లోకానికి పంపనుద్దేశించాడు. అయినా, అప్పుడప్పుడు, యూదులయొక్క పొరుగువారైన అన్యజనులను గూర్చి పాతనిబంధనలో సంగతులు కన్పిస్తాయి. ఉదాహరణకు, అన్యుల పట్టణమైన నీనెవెకు దేవుడు యోనాను పంపాడు (యోనా 1:1, 2). యూదేతరుడైన బిలామును సయితము మెస్సీయాను గూర్చి తేటగా పలుక వీలుకలిగించాడు (సంఖ్యా. 24:17). అన్యజనుల పట్ల దేవుని అక్కరను కనుపరచే మరోక సంఘటనయే ఈ జ్ఞానుల కథనం.

నిశ్చయంగా చెప్పగలిగిదంతా, ఏదో విధంగా క్రీస్తు జన్మను గూర్చిన సందేశం జ్ఞానులు ఎరుగునట్లు దేవుడు చేశాడు, వారు మెస్సీయాను ఎలా కనుగోవాలో దేవుడు వారికి సందేశాన్ని అందించాడు. తరువాత, దేవుడు జ్ఞానులతో కలలో మాట్లాడాడు (మత్తయి 2:12). యూదుల రాజును గూర్చిన తొలి సందేశం కూడా ఆలాటి విధానంలోనే ఆయన వారికి అందించి ఉండవచ్చు.

తూర్పుదేశపు జ్ఞానులను దేవుడు నడిపిస్తున్నట్టు రుజువే కావాలనుకుంటే, నక్షత్రమే తగినంత రుజువునిస్తుంది. ప్రకృతి సిద్ధమైన ఏ ఖగోళ గ్రహముకూడా జ్ఞానుల నక్షత్రము కదిలినట్టు కదిలియుండదు. ఏ నక్షత్రమును ఉత్తరమునుండి దక్షణమునకు జరుగదు, భూసంబంధమైన స్థలానికి "పైగా" ఏ నక్షత్రమును నిలువదు (మత్తయి 2:9).

నేడు ప్రభువును వెదకువారికి దీన్ని వర్తింపజేయవచ్చు. మొదటిగా నేను చెప్పేదేమంటే, జ్ఞానులు "యూదుల రాజును" కనుగొనడంలో దేవునికి ఎంత శ్రద్ధ ఉందో, నేడు నీవు ప్రభువును కనుగొనడంలో ఆయనకు అంతే శ్రద్ధ ఉంది. పైగా నేను చెప్పేదేమంటే, రక్షకుని వెదకడానికి నీవు (అద్భుత రీతిగా కాదనుకో, ఆయన కరుణాహస్తముచేత).

యేసును నీవు కనుగొనాలంటే, "దేవుని నడిపింపును" గైకొనడానికి నీవు యిష్టపడాలి. "మనుష్యులు తమ ప్రవర్తనయందు సన్మార్గమున ప్రవర్తించుట వారి వశములో లేదు" (యిర్మీయా 10:23). కారణం ముఖ్యం (యెషయా 1:18), అయితే అది ప్రత్యక్షత

యొక్క స్థానంలో ఉండనేరదు. (ఎందుకంటే) "నా తలంపులు మీ తలంపులవంటివి కావు, మీ త్రోవలు నా త్రోవలవంటివి కావు, ఇదే యెహోవా వాక్కు. ఆకాశములు భూమికిపైన ఎంత ఎత్తుగా ఉన్నవో మీ మార్గములకంటె నా మార్గములు, మీ తలంపులకంటె నా తలంపులు అంత యెత్తుగా ఉన్నవి" (యెషయా 55:8, 9).

దేవుని నడిపింపును నీవు అంగీకరించినట్టయితే–తక్షణమే – నీవు దానిని వెంబడింప సిద్ధంగా ఉండాలి. జ్ఞానులకు దేవుడు తన వర్తమానం అందించినతోడనే (ఆయన దాన్ని ఏ రూపంలో చేసినా), వారు వెనుకాడలేదు. వందలకొలది మైళ్లు అలసటచెందే దీర్ఘకాలపు ప్రయాణాన్ని అప్పుడే మొదలుపెట్టారు.

అవసరమైన మరొక లక్షణాన్ని ప్రస్తావించాలి: దేవుని నడిపింపును అనుసరించడానికి, నీ మనస్సు వినయంతో నిండాలి. జ్ఞానులు తమ యిండ్లను విడిచిపెట్టినప్పుడు, వారి చివరి గమ్యం ఎక్కడో వారెరుగరు; నక్షత్రాన్ని వెంటాడాలనేది మాత్రమే వారెరుగుదురు. వారు యెరూషలేమునకు వచ్చినప్పుడు, తరువాత ఎక్కడికి వెళ్లవలెనో దిక్కుతోచలేదు. అదృష్టవశాత్తు, దిక్సూచులను అడిగి తెలిసికోనంతటి అహంబావులు కాదు. (ఎరుగని చోట్లలో పయనించేటప్పుడు, మర్యాదను కాపాడుకోగోరి మనలో కొందరు యితరులను అడగడానికి యిష్టపడరు). ప్రభువును వెదకడంలో వినయం అవసరం.[13]

మన స్టడీకి తిరిగివస్తే, తమ ప్రయాణంలో అతి ముఖ్యమైన ఉపదేశాలను దేవుడు తన లేఖనాల ద్వారా బయలుపరచడం ముఖ్యమైయున్నట్టు నేను చూస్తున్నాను. నక్షత్రం వారిని యెరూషలేము వరకు నడిపించింది. వారికి యింకను వాక్యానుసారమైన సందేశం అవసరమయింది. అక్కడ ఏమి జరిగిందో నీకు తెలుసు. జ్ఞానుల విచారణ హేరోదుకు వినబడినప్పుడు, అతడు యూదా మతనాయకులను సమకూర్చి, "క్రీస్తు ఎక్కడ పుట్టునని వారినడిగెను" (మత్తయి 2:4). వారు యిలా బదులిచ్చారు:

> యూదయ దేశపు బేత్లెహేములోనే;[14] ఏలయనగా
> యూదయ దేశపు బేత్లెహేమా
> నీవు యూదా ప్రధానులలో
> ఎంతమాత్రమును అల్పమైనదానవు కావు;
> ఇశ్రాయేలను నా ప్రజలను పరిపాలించు అధిపతి
> నీలోనుండి వచ్చును
> అని ప్రవక్తద్వారా వ్రాయబడియున్నదనిరి (5, 6 వచనాలు).[15]

రాజు ప్రశ్నకు తగిన జవాబు కనుగొనడానికి, వారు లేఖనాలకు వెళ్లవలసి వచ్చింది – మీకా 5:2.[16]

దేవుని గూర్చి బైబిలునకు వెలుపల మనం కొంత తెలిసికొనవచ్చు. ఆయన లోకంలో పని చేస్తున్నాడు. ఆయన లోకంలో తన సూర్యుని ఉదయింపజేస్తున్నాడు, వర్షం కురిపిస్తున్నాడు (మత్తయి 5:45). "ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచురపరచుచున్నది" (కీర్తన. 19:1). కొంతవరకు, "ఆయన అదృశ్యలక్షణములు అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వమును జగదుత్పత్తి మొదలుకొని సృజింపబడిన వస్తువులను ఆలోచించుటవలన తేటపడుచున్నది" (రోమా

1:20). అయినా, ఆయనను వెదకి కనుగొనాలంటే, మాత్రం, తప్పక ఆయన వాక్యము వద్దకు వచ్చి తీరాలి. లేఖనాలను గూర్చి ప్రభువు మాట్లాడుతూ యీలా అన్నారు: "లేఖనములయందు మీకు నిత్యజీవము కలదని తలంచుచు వాటిని పరిశోధించుచున్నారు, అవే నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి" (యోహాను 5:39).

"మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీకరించుడి" అని యాకోబు హెచ్చరించాడు (యాకోబు 1:21). "క్రీస్తు యేసునందుంచవలసిన విశ్వాసము ద్వారా రక్షణార్థమైన జ్ఞానము నీకు కలిగించుటకు శక్తిగల పరిశుద్ధ లేఖనము"లని పౌలు పేర్కొన్నాడు (2 తిమోతి 3:15). నిన్ను నడిపించడానికి దేవుడు నీకొరకు నక్షత్రాన్ని పుట్టించాడు, కాని నిన్ను నడిపించడానికి పరలోకసంబంధమైన ప్రకాశాన్ని – తన గ్రంథంలో నీకు ప్రసాదించాడు. దేవుని వాక్యాన్ని, "పాదములకు దీపమును నా త్రోవకు వెలుగునైయున్నద" ని కీర్తన రచయిత వర్ణించాడు (కీర్తన. 119:105).

మనం ఆ జ్ఞానుల వంటి జ్ఞానులమైయున్నట్టయితే, దేవుని వాక్యాన్ని పరిశీలించి, అది ఏమి చెప్పుతుందో దాన్ని చేయబద్ధులమైయున్నాం. ప్రభువు వద్దకు వెళ్ల ననుసరించవలసిన మార్గాన్ని క్రొత్త నిబంధన మనకు బయలుపరచుతుంది: మనం యేసునందు విశ్వసించాలి (యోహాను 3:16); మనం మన పాపముల విషయమై మారుమనస్సుపొందాలి (లూకా 13:3); యేసునందలి మన విశ్వాసాన్ని ఒప్పుకోవాలి (మత్తయి 10:32); మనం ముంచడం పొందాలి (మార్కు 16:16; అపొ. 2:38). రోమా 6:3; బాప్తిస్మం మనలను "క్రీస్తులో" ఉంచుతోంది (గలతీ 3:27) – క్రీస్తుతో ఉండడమే మన గురి! ఆయనతో నివసించడమే మనం కోరుకునే గమ్యమైయుంది!

## వారు యేసును కనుగొన్నారు (7-11 వచనాలు)

జ్ఞానులు యేసును కనుగొన్నారు. నీవు వెదకునది కనుగొన్న ప్రతిసారి బహు ఆనందంగా ఉంటుంది. అది చేరుకోలేని, ఎక్కడో పెట్టిన వస్తువు కనబడడమేగాని[17] అయితే రక్షకుని కనుగొన్నంత ఆనందం మరి ఎందును ఉండదు!

ప్రభువు జన్మించడానికి అనేక సంవత్సరాల ముందుగా, తన కుమారుడైన సొలొమోనుతో దావీదు యిలా అంటున్నాడు: "ఆయనను వెదకిన యెడల ఆయన నీకు ప్రత్యక్షమగును" (1 దినవృ. 28:9). రాజు మార్గంలో సరియైన దృక్పథముతో జ్ఞానులు యేసును వెదకినందున, వారాయనను కనుగొనునట్లు దేవుడు శ్రద్ధవహించాడు.

మెస్సీయా ఎక్కడ జన్మించాడో చెప్పిన తక్షణమే, జ్ఞానులు యెరూషలేమునుండి దక్షిణ దిశగా బయలుదేరారు (7–9ఎ వ.) వారు అయిదు మైళ్ల మార్గంలో బయలుదేరునంతలో నక్షత్రం వారికి తిరిగి ప్రత్యక్షమయ్యింది.[18] "వారు ఆ నక్షత్రము చూచి, అత్యానందభరితులై"య్యారు (10 వ.). సరియైన మార్గంలో తామున్నట్టు వారు గ్రహించారు. "వారు చూచిన నక్షత్రము ఆ శిశువు ఉండిన చోటికి మీదుగా వచ్చి నిలుచువరకు వారికి ముందుగా నడిచెను" (9 వ.). చివరికి, వారు "యింటిలోనికి వచ్చి, తల్లియైన మరియను ఆ శిశువును చూచి"రి (11ఎ వ.).

అంత దీర్ఘకాలంగా వారు వెదకుతూ వచ్చిన వానిని వారు కనుగొనినప్పుడు కలిగిన వారి ఆనందానికి అవధులు లేకపోయి ఉండవచ్చు. అనేక సంవత్సరాల క్రిందటే ప్రజలు కనిపెట్టినప్పుడు "Eureka" అని వారు కేకలు వేశారు. (Eureka అనేది గ్రీకు పదం "నేను (దాని) కనుగొన్నాను" అని దాని అర్థం). జ్ఞానులు ఏమని కేకలు వేశారో నాకు తెలియదు – వారు ఏమైనా అన్నారో లేదో కూడా తెలియదు – మరియు చేతులలో ఉన్న శిశువును వారు చూచినప్పుడు – వారి ప్రయాణంలోని కష్టాలమీదగాని, వారు చేసిన ఏ త్యాగం మీదగాని వారి మనస్సు పోయి ఉండదని నేను రూఢిగా నమ్ముతున్నాను. వారి తృష్ణ, వారి అన్వేషణ విజయవంతంగా ముగింపబడిందనే ఆనందంతో వారి హృదయాలు తప్పక నిండి ఉంటాయి.

సరియైన మార్గంలో సరియైన దృక్పథంతో నీవు ప్రభువును వెదకినట్లయితే, ఆయనను తగినరీతిలో కనుగొనడానికి దేవుడు నీకు సహాయపడతాడు. క్రీస్తులోనికి నీవు బాప్తిస్మము పొందినప్పుడు, "ధర్మశాస్త్రములో మోషేయు ప్రవక్తలును ఎవరిని గూర్చి వ్రాసిరో ఆయనను కనుగొంటిమి; ఆయన యోసేపు కుమారుడైన నజరేయుడగు యేసు" అని ఫిలుప్పువలె నీవును చెప్పగలవు (యోహాను 1:45). ఆ జ్ఞానులవలెనే, నీవును – "చెప్పనశక్యమును మహిమాయుక్తమైన సంతోషముగల" వాడవై ఆనందించవచ్చు (1 పేతురు 1:8)!

## వారు యేసును పూజించిరి (2, 11 వచనాలు)

జ్ఞానులు యేసును కనుగొని, ఆయనను పూజించిరి. దైవికమైన చిక్కు సమస్యను యూదుల రాజును కనుగొనడంతో పరిష్కరించామని వారు అతిశయించలేదు. "ఆయనను పూజించుట"కే తాము పాలస్తీనాకు వచ్చినట్టు వారు చెప్పుకున్నారు (2 వ.). నిజంగా, వారు ఆయనను చూచినప్పుడు, "సాగిలపడి, ఆయనను పూజించిరి" (11 వ.). రాజుల రాజునకు తగినట్టు వారు ఆయనను పూజించారు (ప్రకటన 19:16).[19]

అయినా, ఆయనకు మొక్కుటకంటెను అధికంగా వారాయనకు చేసిరి: "తమ పెట్టెలు విప్పి, బంగారము సాంబ్రాణి బోళమును కానుకలుగా ఆయనకు సమర్పించిరి" (2:11సి).[20] ఈ కానుకలలో చిహ్న సంబంధమైన ప్రాముఖ్యతను కొందరు చూచారు: బంగారము రాజునకు కానుకయని అన్నారు. సాంబ్రాణి ధూపానికి సంబంధించింది గనుక[21] అది యాజకునికి బహుమానమన్నారు. బోళము మృత దేహాన్ని సమాధికి సిద్ధపరచడంలో ఉపయోగిస్తారు (యోహాను 19:39), గనుక మన పాపములకొరకు చనిపోయే రక్షకునికి గురుతు, అది రక్షకునికి బహుమానమన్నారు. యేసు యివన్నీ, అంటే, – రాజు, యాజకుడు, రక్షకుడునై యున్నాడు కాని – ఆ కానుకలు కానుకలుగా ఎన్నుకొని ఉండవచ్చు.[22]

అవి ఏమైయున్నాయి అనేవాటిమీద కానుకలయొక్క విలువ ఆధారపడింది. అవి ఎలాంటివి అన్నవాటిమీద ఆధారపడదు. అవి వేటిని సూచించాయి అనేది ముఖ్యమైనది; వాటితో జ్ఞానులు తమ పూజను రాజునకు తగినట్టుగా వ్యక్తపరచాలని వారు కోరుకున్నారు. సహజమైన పూజ, కానుక సమర్పణ అనే వాటిని వేరుచేయలేం.[23] పాత నిబంధనకు

దాని అర్పణలున్నాయి. క్రొత్తనిబంధనకు దాని సంబంధమైన అర్పణలున్నాయి (1 కొరింథీ. 6:1, 2; 2 కొరింథీ. 9:7). ఆరాధనా కార్యక్రమము యొక్క ఈ భాగంలో కొన్నిసార్లు శబ్దం అధికమౌతుంది. అంటే, ఆరాధనలో కానుకల సమర్పణ ప్రాముఖ్యం కాదన్నట్లు అది సూచిస్తుంది – కాని అది ముఖ్యమైనదే.

ప్రభువు యెదుట పెట్టడానికి బంగారము, సాంబ్రాణి, బోళములు నీకు లేవా? అయితే నీకు కలిగిన దానిలో శ్రేష్టమైనది ఆయనకు సమర్పించు (2 కొరింథీ. 8:5; రోమా 12:1, 2లను చూడు). మొదటిగా నిన్ను నీవు సమర్పించుకో, తరువాత నీకున్న దానిలో అతిశ్రేష్ఠమైన దాన్ని సమర్పించు. ఊరకయే వచ్చేవాటిని దావీదు దేవునికి సమర్పింప నిష్టపడడు ( 2 సమూ. 24:24).

జ్ఞానులు యేసును కనిగొనినప్పుడు, వారాయనను పూజించారు, తమ కానుకలు ఆయనకు సమర్పించారు. నీవు వారివంటి జ్ఞానం కలవాడవా?

## ముగింపు (10, 12 వచనాలు)

ఆ జ్ఞానులను గూర్చి మనకు అనేక సంగతులు తెలియవు. వారు యెరూషలేమునకు రాక ముందు వారిని గూర్చి మనకు అంతగా తెలియదు. వారు తమ స్వదేశానికి తిరిగి వెళ్లిన తరువాత యికను మనకు ఏ విషయమూ తెలియదు. మరువలేని ఒక దృశ్యంలో వారు బైబిలు పుటల మీద కన్పించి అదృశ్యమౌతారు. అయినా, మనకు ఒక విషయం మాత్రం తెలుసు: ప్రభువును వెదకడంలో వారి జీవితాలు ధన్యమయ్యాయి. 10వ వచనం గుర్తుంచుకో: “వారు ఆ నక్షత్రమును చూచినప్పుడు, అత్యానంద భరితులయ్యారు.” వారు ఆనందంతో నింపబడినవారయ్యారు అనే హెబ్రీ పదరూపాన్ని రచయిత వినియోగించాడు. ఆ జ్ఞానులు ఎంతగా ఆనందించారో ఆ పదమే మనకు చాలినంత తెలుపుతుంది. ఆ తరువాత లేఖన భాగం “గొప్ప,” “అత్యానంద భరితులై” అని కూడా సూచించింది. ప్రభువును కనుగొన్నందుకు జ్ఞానుల ఆనందానికి అవధులు లేవు! వారికి ముందుగా వచ్చిన గొర్రెల కాపరులవలెనే, పేదగానున్న బేత్లెహేము యింటినుండి వారు వెడలి పోయినప్పుడు, వారు కనుగొని ఆ బాలుడైన రాజును గూర్చి వారిని కలిసికొన్నవారికందరికి ప్రచారము చేసియుండవచ్చు (లూకా 2:17, 18).

రక్షకుని నీవు వెదకి కనుగొన్నట్టయితే, నీవు ఊహించగలదానంతటి కంటే అధికంగా నీ జీవితం కూడా దీవించబడుతుంది “తన అతిక్రమములకు పరిహారము నొందిన వాడు” ధన్యుడని పౌలు అంటున్నాడు (రోమా 4:7). మరియు “దేవుడు తన్ను ప్రేమించు వారి కొరకు ఏవి సిద్ధపరచెనో అవి కంటికి కనబడలేదు, చెవికి వినబడలేదు, మనుష్య హృదయమునకు గోచరము కాలేదు” అని వ్రాయబడియున్నదని అతడు తెలిపాడు (1 కొరింథీ. 2:9).

మనం చదువుతున్న ఈ లేఖన భాగం మూడు రకాలైన మనుష్యుల మధ్య తారతమ్యాన్ని తెలుపుతుంది: వీటిలో ఒక రకం జ్ఞానులు క్రీస్తును పూజించడానికి వారాయనను వెదకుతూ వచ్చారు. రెండవ రకం, హేరోదు. అతడు క్రీస్తును చంప

వెదకాడు. మూడవ రకం, మతనాయకులు: యేసు వారికి కొన్ని మైళ్లదూరములో ఉన్నప్పటికి వారు ఆయనను కనుగొనడానికి ప్రయత్నించ లేదు. వారు కొన్న ఈ మూడు రకాలైన ప్రజలు నేటికిని జనులలో ఉన్నారు. స్వార్థపరమైన వారి జీవిత విధానాలకు యేసు ఆపదయన్నట్టు చూస్తున్నందున వారు ఆయనను వ్యతిరేకించి, దురభిప్రాయం కలిగియుంటారు. యేసునూ, ఆయన వారి జీవితాలను ఆశీర్వదించే విధానాన్నీ ఎరుగని గొప్ప సామూహికమైన జనులున్నారు. ఏదియెలాగున్నా, యేసును వెదకే కొందరైనా ఉన్నారు, అందుకు దేవునికి స్తోత్రములు. నీవును ఇట్టివారిలో ఒకడవని నిరీక్షిస్తున్నాను.

---

సూచనలు

[1]ప్రభువును వెదకడాన్ని గూర్చిన అనేక లేఖన భాగాలున్నాయి. ముందుగా సూచించినవాటికి తోడు నా దృష్టికి వచ్చినవి: ఎజ్రా 8:22; కీర్తన. 10:4; 14:2. [2]నేను దీన్ని ప్రసంగించేటప్పుడు ఎక్కువ సమయం ఈ పాయింటులోనే గడుపుతాను. [3]కథ నీ శ్రోతలకు ఎరుకైనది కాకుంటే –నీవు దాన్ని వారికి వినిపింపవచ్చు. [4]Gene Cloer, in *The Welcome of the King,* — జ్ఞానులు ఏమి చేశారో చెప్పి, ప్రతిపాయింటు చివరిలో, "మనము వారంత జ్ఞానులమా?" అని అడిగాడు ("మత్తయి రాజును పరిచయం చేయుట," ట్రూత్ ఫర్ టుడే జూలై 1989 :6–8). [5]భౌతిక శూన్యతను ప్రకృతి ద్వేషించినదాన్ని పూరించడానికి త్వరపడుతుంది. మనుష్యులు సమాచార శూన్యతను ద్వేషించుతారు. వారు జ్ఞానంతో దాన్ని నింపలేకపోయినప్పుడు ఊహలతో దాన్ని నింపుతారు. గనుక ఏడవ శతాబ్దపు పుక్కిట పురాణం– ముగ్గురు జ్ఞానుల పేర్లు, వారు వచ్చిన దేశము, వారు యిచ్చిన కానుకలు, ఎవరు ఏమి యిచ్చింది తెలిపింది. [6]జ్ఞానులను గూర్చి యింకా ఎక్కువ సమాచారం కొరకు "మనకు శిశువు పుట్టును" అనే పాఠంలోని సూచనలను చూడు. [7]ప్రాచీన సమాధి చిత్రలేఖనం యిద్దరు జ్ఞానులను చిత్రించింది. అయితే దైవ ప్రేరేపితముకాని సంఘ పారంపర్యం పన్నిద్దరు జ్ఞానులను సూచించింది. [8]మెస్సీయా సకల జనములను ఆశీర్వదించునను వాస్తవాన్ని గూర్చి, యెషయా 42:1, 6; 49:6, 22; మత్తయి 12:18–21లను చూడు. [9]అపొ. 2:9, పాలస్తీనాకు తూర్పు ప్రాంతమున ఉన్న యూదులను ప్రస్తావించింది. [10]జోసీఫస్ ప్రకారం, లోకాన్ని ఏలే రాజు యూదయనుండి వస్తాడనే భావన (కొంతవరకు) జనముల మధ్య వ్యాపించింది. మత్తయి 23:15 యూదుల మతమార్పిడి కార్యాన్ని సూచించలేదు.

[11]ఊహలలో గ్రహముల లెక్కలు, ఉల్కలు వగైరాలు ఉంటాయి, వీటిలో ఏదియు లేఖనంలోని నక్షత్రానికి గాని దాని పనికిగాని సంబంధించినవి కావు. [12]J. W. McGarvey and Philip Y. Pendleton, *The Fourfold Gospel or A Harmony of the Four Gospels* (Cincinnati: Standard Publishing Co., 1914) 42. [13]దేవునికి యిష్టులుగా ఉండడంలో వినయం గలవారైయుండడం అనే లేఖన భాగాల్లో యాకోబు 4:6; 1 పేతురు 5:5లు కూడా ఉన్నాయి. [14]పాలస్తీనాలో ఉన్న మరియొక బేత్లెహేము నుండి దీన్ని వేరు చేయడానికి "యూదయ"లోని అనే ప్రయోగం కలుపబడింది (యెహోషువ 19:15, 16; న్యాయాధి. 12:8, 10). [15]"బేత్లెహేము" అంటే రొట్టె యిల్లు అని అర్థం. "జీవాహారమునకు" పుట్టిన స్థలంగా ఉండడం ఆ పేరు దానికి తగినదైయినట్టుంది (యోహాను 6:48). [16]శాస్త్రులును యాజకులు కూడా 2 సమూ. 5:2లోని ప్రయోగాన్ని కలిపారు. [17]లూకా 15లో పోగొట్టుకున్న దానిని వెదకి కనుగొన్నప్పుడు ఉండిన సంతోషాన్ని తెలుపుతుంది. [18]ఇది లేఖనంలో గుప్తమైయుంది. ఆ నక్షత్రాన్ని గురించి మనకు ఎక్కువగా తెలియదు – అది ప్రతి రాత్రి కన్పిస్తుందో లేదో లేక అప్పుడప్పుడు మాత్రమే కన్పిస్తుందో కూడా తెలియదు. [19]"పూజ" అని తర్జుమా చేయబడినది దేవునికిగాని మనిషికిగాని యిచ్చే మర్యాదను సూచిస్తుంది. అందువలన జ్ఞానులు యేసును దేవునిగా పూజించారో లేక కేవలం ఒక రాజుగానే గుర్తించి పూజించారో అనే ఒక ప్రశ్న మిగిలిపోయింది. "దేవుని యెడల చూపు మర్యాద" అనే భావంతో మత్తయి ''పూజించుట'' అనే పదాన్ని వినియోగిస్తాడు గనుక అదే భావంతో యిక్కడ కూడా ఉపయోగింపబడియుండవచ్చు. [20]ఆ మూడు కానుకలను గూర్చి ఎక్కువ వివరాలను "మనకు శిశువు పుట్టును" అనే పాఠంలో చూడు.

[21]ప్రత్యక్షగుడార సంబంధమైన ధూపంలో సాంబ్రాణి ఒక భాగమైయుంది (నిర్గమ. 30:34–38). [22]దేవుని

కటాక్షములో, ఈ కానుకలను సులభంగా యోసేపు ఐగుప్తుకు తరలించుకునే అవకాశముంది. [23]ఆరాధనగా కాకుండ ఒకడు యివ్వవచ్చు కాని యివ్వకుండ ఒకడు ఆరాధించలేడని ఒక వ్యక్తి అన్నాడు; ఎందుకంటే నీ ప్రాణము, ఆత్మ, హృదయము దేవుని స్తుతించుటకు సమర్పించాలి. [24]దేవుడు జ్ఞానులను ఎలా హెచ్చరించాడో, మరొక మార్గంలో వారు ఎలాగు తిరిగి వెళ్లారో అనే విషయాలను, వాటి వెంట జరిగిన కార్యాలను నీవు ప్రస్తావించగోరవచ్చు (మత్తయి 2:12). కొందరు సువార్తికులు యింకా కొంత ఎక్కువైన వర్తింపుకు ప్రయత్నింపవచ్చు. క్రీస్తును దర్శించిన మీదట జ్ఞానులు మరోక మార్గము గుండా వెళ్లినట్టే (మత్తయి 2:12), క్రైస్తవులమైన తరువాత మనం మరియొక మార్గం గుండా వెళ్లాలి. అంటే, మరో విధమైన జీవితాన్ని మనం జీవించాలి. [25]ఈ ప్రసంగాన్ని నీవు ఉపయోగించినప్పుడు, క్రైస్తవుడుగా మారడానికి ఒకడు ఏమి చేయాలో నీవు రివ్యూ చేయగోరవచ్చు. ఎంత తొందరగా వీలుంటే, అంత తొందరగా ప్రభువునకు లోబడేలా వ్యక్తులను, ప్రోత్సహించు. ప్రసగించే ఈ విధానాన్ని బట్టి శ్రోతలలో ఎవరికైనా ప్రశ్నలుంటే, బైబిలుకు సంబంధించి రక్షకుని వెదకుటలో ఆ ప్రశ్నలను వెదకడానికి నీవు వారికి సహాయం చేయవచ్చు.